రూ.13 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: తాళ్లబస్తీ నుంచి మల్కాజిగిరి వైపు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఇంజనీరింగ్, ట్రాఫిక్ పోలీసులకు కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. మల్కాజిగిరి డివిజన్ విష్ణుపురి కాలనీ భజరంగ్ కిరాణా స్టోర్స్ వద్ద ఇటీవల బాక్స్‌డ్రైన్ నిర్మాణం పూర్తి చేశారు. ఆ ప్రాంతంలో సుమారు రూ. 13లక్షలతో రోడ్డు పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈస్ట్ ఆనంద్‌బాగ్ నుంచి మల్కాజిగిరి వైపు పనులు జరిగే ప్రాంతంలో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయం చేసుకోవాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఏఈ నవీన్, వీఐ రమేష్, ప్రభుగుప్తా, శ్రీకాంత్‌గుప్తా, పుల్లారావు, లీలావతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు బోధించాలి



స్పోర్ట్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి

బోడుప్పల్: విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలను బోధించాలని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి అన్నారు. బోడుప్పల్ శుభోదయ కాలనీలోని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన స్పోర్ట్స్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ధనార్జనే ధ్యేయం కాకుండా ఉన్నత విలువలతో కూడిన విద్యావ్యాప్తికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు శారీరక, మానసిక దృఢత్వం, క్రమశిక్షణను ఇస్తాయన్నారు. విద్యార్థులు వివిధ రకాల ఆటల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. స్కూల్ రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ సరిత విలియమ్స్, నీలిమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే ప్రజా పాలన'



ప్రజాపాలన విజయోత్సవంలో టీపీసీసీ కార్యదర్శి ప్రమోద్‌కుమార్

మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే ప్రజాపాలన సాధ్యమవుతుందని టీపీసీసీ కార్యదర్శి ప్రజాపాలన ఇన్‌చార్జి ప్రమోద్‌కుమార్ అన్నారు. ప్రజాపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ బీ– బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ.. 'పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు జరిగిన మేలు కన్నా.. కీడే ఎక్కువ ఉందని' విమర్శించారు. దశాబ్దాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమైందన్నారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, అశోక్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, పిట్టల శ్రీను పాల్గొన్నారు.

చర్లపల్లిలో ..

కుషాయిగూడ: కాంగ్రెస్ ప్రజాపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు సీతారాంరెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, ఆనంద్‌రాజ్‌గౌడ్, గోపాల్‌యాదవ్, క్రాంతి, వెంకట్‌గౌడ్, లింగంనాయక్, నవనీత, సంధ్య, వరలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవం

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ అనంతసరస్వతీనగర్‌లోని జ్ఞానసరస్వతీ అమ్మవారి దేవాలయంలో సుబ్రహ్మణ్య ఉపాలయంలో శనివారం సుబ్రహ్మణ్యషష్ఠి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రాజశేఖరశర్మ, గురు, సాయిలు ఉదయం మూలవిరాట్‌కు విశేష అభిషేకం, అలంకరణ, అర్చనాది పూజా కార్యక్రమాలు, సుబ్రహ్మణ్యహోమం, రాత్రి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ చైర్మన్ హరీష్, ధర్మకర్తలు, ఆలయ ఈవో రవీందర్ రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శిరీషారెడ్డి

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఏఎస్‌రావునగర్ డివిజన్ పల్లె ప్యారడైజ్‌లో పర్యటించిన ఆయన స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం భవానీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను ప్రారంభించారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, కుమారస్వామి, ఏనుగు రాజిరెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి, శ్రీకాంత్ గుప్తా, సాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి జైల్‌లో 'జైల్ అదాలత్'



కుషాయిగూడ: ఖైదీలకు ఉచిత న్యాయసాయం అందించడానికి శనివారం చర్లపల్లి జైల్‌లో 'జైల్ అదాలత్'ను నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి జిల్లా కోర్టుకు చెందిన న్యాయమూర్తులు పాల్గొని 45 కేసుల్లో 25 మంది ఖైదీలకు న్యాయసాయం అందజేసినట్లు జైల్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఖైదీలు ఉచిత న్యాయసాయం పొందేందుకు జైల్ అదాలత్ చక్కటి అవకాశమన్నారు. న్యాయమూర్తులు ప్రశాంతి, ఎస్ఆర్. దిలీప్‌కుమార్, జైల్ పర్యవేక్షణాధికారి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి మహర్దశ

220 పడకలకు మల్కాజిగిరి ఆసుపత్రి అప్‌గ్రేడ్

- మెడికల్ కాలేజీకి అనుబంధంగా వసతులు
- డయాగ్నస్టిక్ హబ్, రేడియాలజీ ల్యాబ్



మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

సాక్షి,సిటీబ్యూరో: మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి మంచిరోజులు వస్తున్నట్లు కనిపిస్తోంది. ఈసీఐఎల్‌లోని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ ఆసుపత్రిని మార్చడంతో మహర్దశ కలిగినట్లైంది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రజలకు వైద్యసేవలు మరింతగా పెరగనున్నాయి.

వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ ఆసుపత్రిలో పడకల సంఖ్యను పెంచడంతో పాటు దానికి తగ్గట్టుగా అన్నీ వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మల్కాజిగిరి ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రిలో ప్రస్తుతం 70 పడకలు ఉండగా.. ఆ సంఖ్యను 220 పడకలకు పెంచారు.

అదనపు సిబ్బంది నియామకం..

మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన పడకల సంఖ్యకు అనుగుణంగా ఇప్పటికే 94 మంది డాక్టర్లను నియమించారు. ఇందులో మెడికల్ కాలేజీకి సంబంధించిన డాక్టర్లు 49 మంది ఉండగా.. వైద్యారోగ్యశాఖ డాక్టర్లు 45 మంది ఉన్నారు. దీనికి తగ్గట్టుగా స్టాఫ్ నర్సులను కూడా నియమించేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల సంఖ్య 30 ఉండగా.. ఆ సంఖ్యను 100కు పైగా పెంచేందుకు వైద్యారోగ్యశాఖ కసరత్తు చేస్తోంది.

ప్రజలకు అందుబాటులో మరిన్ని సేవలు..

ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజీయాలజీ, సైకాలజీ ,పాథాలజీ, మైక్రోబయాలజీ, గైనకాలజీ , పిడియాట్రిక్స్, జనరల్ సర్జన్, మెడిసిన్, సైకాలజీ, ఆర్థోపెటిక్, ఈఎన్టీ, అప్తమాలజీ, రేడియాలజీ డిపార్ట్‌మెంట్లు ఉండటంతో దీనికి సంబంధించిన విభాగాలు మల్కాజిగిరి జనరల్ ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటుకానుండటంతో ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందనున్నాయి.

అదనపు పరికరాలతో పెరగనున్న వసతులు..

డయాగ్నస్టిక్‌హబ్‌తో పాటు రేడియాలజీకి సంబంధించిన విభాగాలు కూడా త్వరలో ఆసుపత్రికి రానున్నాయి. మరో రెండేళ్లలో మల్కాజిగిరి ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ల సంఖ్యతో పాటు వైద్యసేవల పరంగా మరిన్ని వసతులు ఏర్పడే అవకాశం ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అవసరమైన సదుపాయాలతో పాటు కావాల్సిన పరికరాలు, పారామెడికల్, వైద్య సిబ్బంది సంఖ్య కూడా పెంచనున్నారు.

అల్వాల్ సూపర్ స్పెషల్ ఆసుపత్రితో..

నియోజకవర్గ పరిధిలోని అల్వాల్‌లో నిర్మిస్తున్న టిమ్స్ (సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వాసుపత్రి) పూర్తైతే మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రజలకు సముచిత స్థాయిలో వైద్యసేవలు అందించగలమని, ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

మూడు సీహెచ్‌సీలు..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ఘట్కేసర్, మేడ్చల్, శామీర్‌పేట్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లు, 28 యూపీహెచ్‌పీసీలు, 12 పీహెచ్‌పీలు, 112 బస్తీ దవాఖానాలు, 69 పల్లె దవాఖానాలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కీసర, జవహర్ నగర్, అల్వాల్, బాలానగర్, మల్లాపూర్, షాపూర్‌నగర్‌లోని ఆరోగ్యకేంద్రాల్లో ప్రజలకు 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటుంది.



ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిన వైద్యసేవలు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటికే ప్రైవేట్‌రంగంలో 7 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఈసీఐఎల్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లా ప్రజలకు వైద్యసేవలు మరింత పెరిగే అవకాశం ఉంది.

– డా. రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్‌ఓ

- నారపల్లి ,కుషాయిగూడ, ఎంసీపల్లి, కుత్బుల్లాపూర్, దుండిగల్, పర్వతానగర్, వెంకట్‌రెడ్డినగర్ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గర్భిణులకు ప్రసవాలను నిర్వహిస్తున్నట్లు వైద్యశాఖ తెలిపింది.
- ఈసీఐఎల్ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేశారు. జిల్లాలో బస్తీ,పల్లె దవాఖానాలు, సీహెచ్‌పీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్యశాఖ సేవలందిస్తోంది.

ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

గౌతంనగర్: గౌతంనగర్ గేట్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని గౌతంనగర్ డివిజన్‌కు చెందిన పలు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌతంనగర్ గేట్ వద్ద నిత్యం గేట్ పడటంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. మేకల రాము యాదవ్, కిరణ్ పట్నాయక్, నర్సింహారావు, అచ్యుతరావు, నర్సింగ్‌రావు, గోపాల్‌రెడ్డి, గౌతంనగర్, దయానందనగర్, మల్లికార్జున నగర్, సాయినగర్, భవానీనగర్, వాణీనగర్ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



ఆర్డర్ కాపీలను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్

అల్వాల్: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ అన్నారు. నేరేడ్‌మెట్ పరిధిలో సైబర్ మోసాలకు గురై అతి తక్కువ కాలంలో సైబర్ పోర్టల్‌లో నమోదు చేయడం వల్ల కోర్టు ద్వారా తిరిగి వారి అకౌంట్‌కు రీఫండ్ అయ్యేలా జరిగింది. దీనికి సంబంధించిన ఆర్డర్స్ కాపీలను శనివారం పోలీస్‌స్టేషన్‌లో 47 మంది బాధితులకు అందజేశారు. అనంతరం ఈ డబ్బును రికవరీ చేసేందుకు పనిచేసిన నేరేడ్‌మెట్ సైబర్‌క్రైమ్ హెడ్‌కానిస్టేబుల్ కాంతయ్య, నాగలత, కోర్టు కానిస్టేబుల్ గౌతమ్‌లను ఆయన అభినందించారు. ఎస్సైలు రమేష్, సైదులు పాల్గొన్నారు.

ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థను ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. శనివారం ప్రజాపాలన విజయోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. రూ. 35 కోట్లతో మౌలిక వసతులైన లింక్‌రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కమ్యూనిటీహాల్స్, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. హెచ్ఎండీఏ నిధులు రూ. 15కోట్లతో రా చెరువు, అల్మాస్ కుంట, శుద్ధకుంట చెరువుల్లో సుందరీకరణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం టెండర్ ప్రక్రియ పూర్తైందని, పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. మరో రూ. 6 కోట్లతో పార్కుల అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్‌తో కలిసి ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మా, కొత్త చందర్‌గౌడ్, రాసాల వెంకటేశ్‌యాదవ్, సుమన్‌నాయక్, బీ–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, బోడుప్పల్ పార్టీ ప్రధాన కార్యదర్శులు కొత్త ప్రభాకర్‌గౌడ్, విశ్వం గుప్తా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



శ్రీనికేతన్ పాఠశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు



కౌకూర్‌లో ఉచిత వైద్య శిబిరం

అల్వాల్: అల్వాల్ టీంసాయి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని కౌకూర్‌లో నిర్వహించారు. ఈ శిబిరంలో కిమ్స్, సన్‌షైన్ ఆస్పత్రి వైద్య బృందం పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఆ స్ఫూర్తితోనే వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. అజిత్‌సాయి, శివ, రవికిరణ్, ప్రకాష్‌చౌదరి,సుజాత, పద్మిని పాల్గొన్నారు.

దంతవైద్య శిబిరం..

కుషాయిగూడ: అన్నపూర్ణకాలనీ శ్రీ నికేతన్ పాఠశాలలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నెక్సస్ డెంటల్ ఆసుపత్రి వైద్యులు విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ నర్సింహ్మా, డాక్టర్లు రాఘవేంద్ర, భార్గవి, సిబ్బంది లావణ్య వర్మ, రేణుక, మంజుల పాల్గొన్నారు.

హెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయంలో..

సన్‌సీడ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ ప్రభుదాస్ ముఖ్యఅతిథి హాజరై ప్రారంభించారు. సామాజిక భావనతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, ఆసుపత్రి ఎండీ డాక్టర్ అన్వేష్, చైర్మన్ డాక్టర్ సుజ్యోతి, డాక్టర్లు వంశీ, శశికళ స్థానిక నేతలు నిసార్ అహ్మద్, నరేందర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గీతారెడ్డి శిష్యబృందంచే నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. పుష్పాంజలి, అలరిపు, మూషికవాహన, ముద్దుగారే యశోద, నటేశ కౌతం లాంటి కార్యక్రమాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

నిర్మాణ దశలోనే కుప్పకూలి..

- కూలిన మార్కండేయ ఆలయ ముఖద్వారం
- ఆరుగురు నిర్మాణ కార్మికులకు గాయాలు



కూలిన ఆలయ ముఖద్వారం

రామంతాపూర్ : పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామంతాపూర్ డిమార్ట్ ప్రధాన రహదారికి సమీపంలో ఇందిరానగర్ రోడ్డులో గత నెల రోజులుగా నిర్మిస్తున్న మార్కండేయ స్వామి ఆలయ ముఖద్వారం నిర్మాణదశలోనే శనివారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా కుప్పకూలింది. పనుల్లో నిమగ్నమైన 6 మంది పశ్చిమ బెంగాల్ కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

బీజేపీ బహిరంగ సభకు తరలిన నేతలు



నాచారం నుంచి తరలివెళ్తున్న బీజేపీ శ్రేణులు

మల్లాపూర్: కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభకు నాచారం డివిజన్ నుంచి పెద్దఎత్తున బీజేపీనేతలు తరలివెళ్లారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నవీన్, చంద్రమౌళి, శ్రీధర్‌రెడ్డి, రవికాంత్, రాజిరెడ్డి, గోపి, శేఖర్‌గుప్తా, మంజులవాణి, లావణ్య, రజియా పాల్గొన్నారు.

మల్లాపూర్ నుంచి..

మల్లాపూర్ డివిజన్ బీజేపీ నేతలు, కార్యకర్తలు సరూర్‌నగర్ స్టేడియం సభకు మాజీ బీజేపీ కౌన్సిలర్ ఆంజనేయులు, రవిగంగాధర్, గణేష్, నర్సింహ, నల్ల రాంచందర్, బాలమణి తదితరులు తరలివెళ్లారు.

సీఎంను కలిసిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు



సీఎంతో అరుణ్‌పటేల్

రామంతాపూర్ : ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా విజయం సాధించిన ఆకారపు అరుణ్‌పటేల్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించారన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



మల్లాపూర్: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని దక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ పాఠశాల చైర్మన్ నవనీతరావు అన్నారు. శనివారం 'ఒలింపిక్ టోర్నీ' పేరుతో క్రీడా పోటీలు నిర్వహించారు. కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశాంసాపత్రాలతో పాటు ట్రోఫీలను అందజేశారు. ప్రిన్సిపాల్ సుమామీనన్, కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

బోడుప్పల్: నగర పాలక సంస్థ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టే అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. చెంగిచర్ల 1వ డివిజన్ పరిధిలో ఫుడ్స్ కాలనీలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న రెండో అంతస్తు, 14వ డివిజన్ వక్ఫ్ బోర్డు స్థలంలో అనుమతులు లేకుండా గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తును శనివారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కూల్చివేశారు. 13వ డివిజన్‌లో 63 సర్వే నంబరు ప్రభుత్వ భూమిలో అక్రమ ఇంటిని రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రామలింగం మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా చేపట్టే నిర్మాణాలకు తెలంగాణ మున్సిపల్ యాక్ట్– 2019 ప్రకారం నోటీసు లేకుండా కూల్చివేస్తామని స్పష్టం చేశారు. నిర్మాణదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకుని నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కూల్చివేతల్లో టీపీఎస్ కావ్య సిబ్బంది పాల్గొన్నారు.

లయోలాలో యువజనోత్సవాలు

అల్వాల్: లయోలా కళాశాలలో యువజనోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా సినీ డిజైనర్, రచయిత నీరజ కోన హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కేశవచంద్ర రమావత్, లవ్ యువర్ ఫాదర్ చిత్రాల బృందం పాల్గొని విద్యార్థులతో కలిసి సందడి చేశారు. కళాశాల కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఫ్రాన్సిస్ జెవిర్ ఎస్‌జే, ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఎన్‌బీ.బాబు ఎస్‌జే, నటులు రాకింగ్ రాకేష్, హర్షవర్ధన్, శరత్ చంద్ర, అరుల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

